కథానిక

# పసి హృదయాలు

"సుబ్బన్న"

భోగి మంటల విషయంలో పిల్లలకు పెద్దలకు తగాదా వచ్చింది. ఊరి వెలుపలి విష్ణాలయం దగ్గర వేద్దామన్నారు పిల్లలు. అందుకు ఒప్పుకోలేదు పెద్దలు.

"మా పనికి మీ ఒప్పుదలేమిటి?"-ముందుగానే ఎదిరించాడు దుర్గాప్రసాద్.

"పిల్లలు మీకేం తెలుసు? భోగి మంటలు నాలుగు వీధులు కలిసేచోట వెయ్యాలిగాని, ఊరిబయ టేమిటి?" అధికార రీత్యా మాట్లాడారు పురాణం శాస్త్రిలగారు.

"అనాదిగావచ్చే ఆచారంరా!" అరుస్తూ సమర్థించారు కరణంగారు.

"అనాదేమిటి మామయ్యా, అన్నింటికీ అదో అడ్డు" రుసరస లాడాడు సూర్యనారాయణ.

"ఊరి మధ్యన పెద్దల మంట, ఊరి చివరన పిల్లల మంట"-రాజీకొచ్చాడు శంభూ. సంధి షరతులు అనుకూలంగానే ఉన్నై. ఐనా పెద్దలు ఒప్పుకుంటూరా?

వీల్లేదంటే వీల్లేదన్నాడు పెద్దకాపు. "అల్లరి వెధవలు. ఒళ్లు కాల్చుకొంటూరు..." ఏవో కారణా లేకరువు పెడుతున్నాడు కొంపలు కూల్చే ప్రయివేటు పంతులు.

"వీళ్ళతో మనకేమిట్రా!" అన్నాడు నాగేశ్వరం. అంతే. ఎక్కడి పిల్లలక్కడ మాయమైనారు.

గడ్డి, తాటాకులు, కట్టెపుల్లలు విష్ణాలయం ప్రక్కకి చేరినై. పడమటి దిక్కున ఆకాశం ఎర్రబారింది. దుర్గాప్రసాద్ తాటాకు వెలిగించాడు. నాగేశ్వరం దానిమీద పొందిగ్గా గడ్డి పరిచాడు. సూర్యనారాయణ చితుకులు పేర్చాడు. శంభూ కట్టె లంటించాడు. విష్ణాలయం ప్రక్కగా నిలువెత్తున మంటలు రేగినై.

"ఒరేయ్ మన మంట గోపురమెత్తున లేవాలిసిందేరా" తీర్మానాన్ని ఉపపాదించాడు శివరావు. ఏకగ్రీవంగా ఆమోదించారు.

"తెల్లవార్లు ఉంటే బలే బాగుంటుంది" అన్నాడు గొళ్ళరాముడు.

అంతా కిలకిలా నవ్వారు.

"భోగి మంట తెల్లవార్లూ ఉంటుంది" రాముడి సందేహాన్ని పోగొట్టాడు శివరావు.

శంభూకో ఉపాయం తట్టింది.

"రాముడూ," అన్నాడు ఆవేశంతో. మంటల వెలుగులో వాడి కళ్లు మెరిసినై. చలి దీరిన వాడి నునుబుగ్గలు చాయలు గ్రక్కినై.

"మోకు, కత్తి తీసుకో" ఆజ్ఞాపించాడు శంభూ.

"ఓస్, అదా. ఈ చుట్టు పక్కలి తాటిమట్టలన్నీ ..." చిటికవేసి పరుగుతీశాడు. వాడి వెనుకనే మరి నలుగురు పిల్లలు వెళ్ళారు.

"ఒరేయ్ నారాయణా! మీ మామయ్యగారి గొడ్లదొడ్డి..."

"గోడమీది పొట్టివడి గడ్డివామి మన కాంట్రాక్టు" పూర్తిచేశాడు సూర్యనారాయణ.

"దుర్గా!"

"సెలవియ్యండి."

"మీ బాబాయిగారి ఇంటిముందు మండె వేసిన తాటాకు."

"చిత్తం చిత్తం"

"ఏమిటూ చిత్తం?"

"ఇక్కడకు చేరాలి."

"వెరిగుడ్. అంతే."

"ఐతే మన డ్యూటీ ఏమిటి ప్రభూ?" నాగేశ్వరం ఆదుర్దాగా అడిగాడు.

"పురాణం శాస్త్రుల్లుగారి పంగ తోటచుటూ నాటిన కంప"...

"బాగానే ఎండింది."

కాలం గడిపేవారు- రకరకాలుగా గొడవగా ఉన్నారు.

బైరాగి, అప్పారావు, ప్రయివేటు పంతులు గారి దొడ్లో ఏరి కోసుకొచ్చిన ముదురుచిక్కుళ్లు కాల్చుకొంటున్నారు. వేడివేడి చిక్కుళ్లమజా అర్థరాత్రి చలిగాలిలో మంటప్రక్క కూర్చున్న ఆ అదృష్టవంతులకే తెలుసుగాని, ఇడ్లీ సాంబారుతో ప్రొద్దులుపుచ్చే మీకేం తెలుసు?

జామపండు కొరికే చిన్నవెధవ చిక్కుళ్ల కోసం రెండో చేయి చాచాడు. పీనాసితనానికి పిల్లలదగ్గర తావేది? అప్పారావు రెండూ బైరాగి నాలుగూ వేడివేడి ముదురు చిక్కుడు గింజలు వాడి లేతచేతిలో పెట్టారు. పెట్టిందే తడవుగా నోటగొట్టుకున్నాడా కొంటెవెధవ. కసకస నవలడం, నాలిక కాలడం, ఏడవటం, కొంతమంది అక్కడ చేరడం కొన్నిక్షణాల్లో వరుసగా జరిగినై.

"ఉయ్యారా! ఊసెయ్!" అరుస్తున్నాడు అప్పారావు.

"నాలిక కాలితే కప్పలాగ నోరుతెరిచి ఏడుస్తాడేగాని ఊసెయ్యడేంరా ?" అడుగుతున్నాడు బైరాగి.

శివరావు పిల్లవాడి నాలికమీది చిక్కుడు ముద్ద క్రిందికిత్రోసి జామపండు చేతిని నోటిదగ్గరకు నెట్టి 'కానియ్' మన్నాడు.

"చిక్కుళ్లెక్కడివిరా?"

"ప్రయివేట్లపంతులు దొడ్లోవి?"

"అరికె చెరుకుతోట కూడ ఉందండి" అందించాడు గొళ్ళరాముడు. పాతిక మందికి పైగా దక్షిణంవైపుకు పరుగుతీశారు.

తోటంతా విరగద్రొక్కుతున్నారు.

"దెబ్బకు రెండు" అన్నాడు శివరావు.

"రెండేమిటి నీమొఖం ఇన్నుంటే?" అందుకొన్నాడు అప్పారావు.

"అది గాదోయ్ తెలివి. తినడానికి చెరుకు. మంటలోకి వెదుళ్ళు." వ్యాఖ్యానించాడు ప్రసాద్.

తోట ధ్వంసమైనట్టే. వెదుళ్ల కట్టలు చెరుకు ముక్కలు మోసుకొచ్చారు.

మంటలోపల వెదుళ్ళు పటపట మన్నై. పంటి క్రింద చెరుకు కరకరమన్నది. ఉత్సాహంగా ఊరుక్కొంటూ కొరుక్కొంటున్నారు.

"బాబూ!" ఓ అస్తి పంజరం వణుకుతూ ముందుకు వచ్చింది. చాలా వికృతంగా ఉంది. కళ్లుమాత్రం పెద్దవిగా ఉన్నై. "నాలుగు కర్రలు నాకివ్వండి గుడిసె బొత్తిగాపోయింది."

"నాలుగు కాకపోతే పది పట్టుకుపో" అనేశాడు అప్పారావు.

"పాపం వాడేం మోస్తాడురా!" అంటూ నాలుగు కర్రలు పట్టుకుని బైరాగి ముందుకు నడిచాడు. కొసిని కర్రలు ముసలి రంగడి కొంపకు చేరినై.

మకర సంక్రాంతి మహాపర్వదినం. సాతాని జియ్యరు మధుర గానం అందరినీ లేపింది. చిమ్మబోతే చీపుళ్ళేవి? "అమ్మా నా గొబ్బి పిడకల దండ లేవే?" "అమ్మా! అమ్మా! చిక్కుడుకాయల రథాలు కడతానంటివే, ఒక్క కాయగూడ లేదు." "సీతా పీటచెక్క లేవే?" "తడిక లేవి?" "పిన్నీ పిన్నీ! ఎదిరింటావిడ పత్యాని కడికితే పిందెలమ్మా ఎట్లా కోస్తానన్నావా? ఒక్క దానిమ్మకాయ కూడ లేదు." "ఆఁ" ఇల్లాళ్ళ గొడవ ఇంతింతనడానికి వీల్లేకుండా ఉంది. అందరికీ వింతగా, గొడవగా అన్యాయంగా ఉంది.

ప్రయివేటు పంతులు ఉగ్రుడై ప్రళయకాలరుద్రుడై "చూసుకోండి నష్టపరిహారం దావా వేస్తాను" అంటూ చిందులు త్రొక్కుతున్నాడు.

పది గంటలవేళ పెద్దలంతా దానాల హడావడిలో ఉన్నారు. ముసలి రంగడిని పెడరెక్కలు విరిచి చెట్టుకు కట్టారు. పప్పు బియ్యం మోసుకుపోతూ "నీకేం మాయరోగం చేను పాడు చెయ్యడానికి" అంటున్నాడు పౌరోహితుడు.

శంభూ, శివరావు పరుగెత్తుకొచ్చేసరికి రంగని అస్తి పంజరంలోనుంచి హంస ఎగిరిపోయింది. ప్రయివేటు పంతులు ఇంకా కారాలు నూరుతూనే ఉన్నాడు. పిల్లల కళ్ళనీటి బిందువులు భూమిమీద రాలినై. వాళ్ళ హృదయాల్లో భోగి మంటలు భగభగ మన్నై.

"కొంచెం పచ్చిగావున్నా ఫరవాలేదు."

"ఐతే మీరో?" శివరావు అడిగాడు.

"నేను ఊరి సంగతి చూసుకొంటాను."

"ఏం? దానిమ్మకాయలు దొబ్బడానికా?"

"నేనూ ఊళ్లోకొస్తాను."

"నేనూ గోడలు దూకగలను."

"నేనూ తడికలు విప్పగలను."

"నేనూ నీతోనే వస్తాను" అంతా గోల పెట్టారు.

"ఒరేయ్ మీకంటే రాముడే నయంరా, పని చెప్పీ చెప్పకముందే పరిగెత్తాడు."

"ఐతే, పళ్ళపని మీకు ముళ్ళపని మాకా?" పేచీ వచ్చింది.

ఇలాగైతే మన మంట గోపురమెత్తున లేవదురా. ప్రతిదానికి పెద్దలులాగ తన్నుకో గూడదు. పిల్లలులాగ పంచుకోవాలి."

"ఏమిటి పంచుకొనేది?"

"పనీ, ఫలితమూ రెండూను. మనలో ఎక్కువ తక్కువలు..."

"తూచ్."

"ఎవడురా వాడు?"

"ఇంకెవడు? బైరాగి."

"ఓరి వెధవ, వచ్చావ్! మరి మీ మావో?"

"వస్తాడొస్తాడు."

"వస్తాడేమిటిరా. వెర్రిమొగమా వచ్చాను" అంటూ అప్పారావు ముందుకొచ్చాడు. ఒక్కమాటు వెలుగులో కలియజూశాడు. రెండు సమిధలు మంటలోవేసి "ఇదిగో నే నిప్పుడే చెబుతున్నా, ఎవరికి ఏమి దొరికినా సరే, తినేవన్నీ కోవెల్లోకి మండేవన్నీ చెరువుగట్టుకీ చేర్చాలి."

జట్లుజట్లుగా ఎవరి పనిమీద వాళ్లు పోయినారు. బైరాగీ మరి నలుగురు పిల్లలూ అక్కడుండి మంట తగ్గకుండా చూస్తున్నారు.

విష్ణాలయ ప్రాకారానికి ఎర్రమన్ను పూశారు. సున్నపుపట్టీలు వేశారు. ప్రహరీ నానుకొన్న చెరువునిండా నీరుంది. చెరువుగట్టునో చింతచెట్టు. చెట్టు పెద్దదైనా కొమ్మలు క్రిందికే వాలి ఉన్నయి.

గుళ్ళో దట్టమైన చీకటి. గుడి వెలుపల దిట్టమైన వెలుగు. వెలుగు నీడలు చెరువు నీటి తరగలతో మిళితమైనయి. చింతచెట్టు చెరువులోకి తొంగి చూసింది. గోడమీది నిలువుచారలు నీటిలో ఊయల లూగినయి. ప్రహరీలో కొబ్బరి చెట్లు రాగం తీశాయ్.

చెరువుగట్టున భోగి మంటలు భగభగమన్నాయి, గుడిలోపలి కంచుగంటలు గణగణమన్నాయి. ఊరిలోపల పెద్దల గుండెలు దడదడ మన్నాయి. తాటిమట్టలు మంట లోపల పెటపెట లాడినాయి. బలుసుకంప మురికి ముళ్లు చిటపట మన్నాయి. మంటనుచూచే పిల్లల కళ్లు ధగధగ మెరిసేయ్.

రాత్రి పదకొండుగంటల సమయం. పిల్లలు గనుక అనుకొన్న ప్రకారం పనిచేశారు. తాటాకులు ఎగిరవచ్చినై, తడికెలు ఎగిరవచ్చినై; కట్టెలు, పిడకలు, చీపురకట్టలు, చింకిచేటలు, పీటచెక్కలు, పీచుగోతాలు, పచ్చడి బండలు— హెచ్చుతగ్గూ లేకుండా జట్లుజట్లుగా, గుంపులు గుంపులుగా భోగిమంట భోగంలో పాల్గొన్నై. మంట గోపురమెత్తున లేచింది.

క్రమక్రమంగా పెరిగిన పిల్లల గుంపు వంద దాటింది.

కరణంగారి దొడ్లో దానిమ్మపళ్లు, పెదకాపు పెరట్లో జామపళ్లు, పురాణం శాస్త్రుల్లుగారి తోటలోని టొమాటోలు, దేవాలయ ప్రాకారంలోని కొబ్బరిబోండాలు రకంవారీగా ఆలయంలో రాసులుతీరినై.

కాపు కమ్మ, మాల మాదిగ, చాకలి మంగలి, కోమటి బ్రాహ్మణ, ఆడ మగ— పిల్లలందరూ స్వామివారి ఎదుట భోగిమంటల వెచ్చని వెల్తుర్లో, నిర్భయంగా నిర్మోహమాటంగా ఆనందంతో పండ్లారగించారు. ధన్యులాపిల్లలు. ధన్యతమము లాబాలక్రీడలు.

ఏనాడు చేసిన పాపఫలితమో ఆ దేవుడు మాత్రం చిమ్మచీకట్లో నిట్టనిలువునా కొయ్యబారి నిల్చున్నాడు.

ఊరంతా నిద్రపోతున్నది. పిల్లలంతా కేరింతాలు కొడుతున్నారు. చెర్రాడి ఉప్మా తెచ్చేవారు, కోతికొమ్మంచిలో చెట్టెక్కేవారు, చెడుగుడులో కవ్వించేవారు, చెమ్మచెక్కలో చిందులేసేవారు, చతుర్ముఖ పారాయణంతో